క్లుప్తంగా

విగ్రహాల పునఃప్రతిష్ట ప్రారంభం



అలంకరణలో ఏడుగురు అమ్మవార్లు, బొమ్మ లింగేశ్వరస్వామి

అగళి: దొక్కలపల్లి సమీపంలోని అక్కగార్ల దేవరపల్లి గ్రామ పొలిమేరలో శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి ఏడుగురు అమ్మవార్లు మూడుపమ్మ, చిక్కమ్మ మారక్క, కావలమ్మ, జీరిగాలమ్మ, రట్బాలమ్మ, మల్లమ్మ, సోదరా మావయ్య బొమ్మలింగేశ్వర దేవాలయంలో శనివారం నూతన విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదివారం, సోమవారం కూడా జలధి పూజ, హోమం, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'అనంత' బాధితులకు చేయూత

పావగడ: అనంతపురం నగరంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన వందలాది మంది వరద బాధితులకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో స్థానిక రామకృష్ణ సేవాశ్రమం అధిపతి జపానంద స్వామి పరిహారం అందించారు. శనివారం పట్టణ సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరదలతో ఇబ్బందులు పడిన రామకృష్ణ, సుశీలరెడ్డి, అభ్యుదయ కాలనీ వాసులకు నిత్యావసర సరుకుల కిట్లు, దుస్తులు, వంట సామాగ్రి తదితర వస్తువులు అందజేశారు. అలాగే విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీశ్, సర్పంచ్ ఉదయ శంకర్, తహసీల్దార్ హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఖాతా తెరవండి



హలుకూరులో ఖాతా చేస్తున్న దృశ్యం

అమరాపురం: నూతనంగా ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాలు తెరవడానికి ఈనెల 15 వరకూ గడువు ఉందని హలుకూరు బ్రాంచ్ పోస్టు మాస్టర్ మధుసూదన్ శనివారం తెలిపారు. జాతీయ బ్యాంకులతో సమానంగా ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ద్వారా లావాదేవీలు జరుపుకోవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఖాతాలు తెరుస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


ఎక్సైజ్ పోలీసుల దాడులు



దాడుల్లో పట్టుకున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లు

హిందూపురం: హిందూపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎన్ఫోర్స్‌మెంట్ బృందం హిందూపురం, పరిగి మండలంలో అక్రమ మద్యం రవాణా అమ్మకాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య శనివారం తెలిపారు. దాడుల్లో ఆరు కేసులు నమోదు చేసి ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి 184 కర్ణాటక మద్యం ప్యాకెట్లు (19.62 లీటర్లు) స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ సునంద, ఎస్ఐలు ఫరూక్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని మీనకుంటనహళ్లిలో శనివారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. వాల్మీకి చిత్రపటాన్ని గ్రామం ప్రధాన వీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రిజర్వాయర్‌లో దొంగలు పడ్డారు!

- అనుమతి లేకుండా చేపల వేట
- పట్టించుకోని అధికారులు



గొల్లపల్లి రిజర్వాయర్

పెనుకొండ: మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో కొందరు అనుమతి లేకుండా చేపలు వేట సాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. వివరాల్లోకెళితే.. రిజర్వాయర్‌లో చేపల పట్టే నిమిత్తం తమిళనాడుకు చెందిన వ్యక్తి వేలం దక్కించుకున్నాడు. తర్వాత కొన్ని రోజుల పాటు తమిళనాడు వాసులతో చేపలు పట్టేవాడు. అయితే అతడు మధ్యలోనే చేపల వేటను వదులుకున్నాడు. తమిళనాడు నుంచి వచ్చిన చేపలు పట్టే వ్యక్తులు తమ ప్రాంతానికి వెళ్లిపోవడంతో తదుపరి వేలం జరగలేదు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం కిలో నుంచి 25 కేజీల తూకం వరకు పెద్దపెద్ద చేపలున్నాయి.

యథేచ్ఛగా చేపల వేట..

చేపల వేలం జరగకపోవడాన్ని అదనుగా భావించిన కొందరు వ్యక్తులు రెండేళ్లుగా యథేచ్ఛగా చేపల వేట సాగిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేళల్లో వలలు వేసి తెల్లవారుజామున 5 గంటలకే బోట్లలో గుట్టుచప్పుడు కాకుండా వాటిని విప్పుకుని ఉదయం కల్లా ప్రజానీకానికి, హోటళ్లకు చేరవేస్తున్నట్లు సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. శనివారం, సోమవారం, మంగళవారం, గురువారం రోజుల్లో క్రమం తప్పకుండా రిజర్వాయర్‌లో దొంగచాటుగా చేపలు చేపల వేట సాగిస్తున్నట్లు తెలుస్తోంది

తేలని పంచాయితీ..

అయితే గత కొంత కాలంగా రిజర్వాయర్‌లో చేపలు పట్టే విషయంలో ఒకే పంచాయతీకి చెందిన దుద్దేబండ, గొల్లపల్లి గ్రామాల మధ్య పంచాయితీ నడుస్తోంది. ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇదే అదనుగా భావించిన కొందరు వ్యక్తులు దొంగచాటుగా చేపలు పట్టడం అలవాటుగా చేసుకున్నారు. పై పంచాయితీ ప్రజలకు విషయం తెలిసినా చేపలు పట్టే వారు తమకు తెలిసిన వారు కావడంతో ఏమీ అనలేకపోతున్నారన్న అభిప్రాయాలున్నాయి. గొల్లపల్లి రిజర్వాయర్‌లో రూ.లక్షల విలువ జేసే మత్స్య సంపద ఉన్నా అది ఆ ప్రాంతంలో ఉన్న ప్రజానీకానికి ఎందుకు ఉపయోగ పడకపోవడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం ఈ విషయంలో పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక ఇతర ప్రాంతాల నుంచి రిజర్వాయర్ వద్దకు గాలాలతో చేపలు పట్టడానికి వస్తున్న కొందరు నీటిలో మునిగి చనిపోతున్న ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తాం

గొల్లపల్లి రిజర్వాయర్‌లో అనుమతి లేకుండా చేపలు పట్టే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఇందుకు సంబంధించి గ్రామస్తులు కాని, గ్రామ పంచాయతీ తరఫున కాని, సంబంధిత అధికారులు కాని ఫిర్యాదు చేయాలి.

– రాజేష్, కియా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ

ఓటరు జాబితాలో నమోదు చేసుకోండి



ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పరిగి: 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 55, 56 పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియపై బీఎల్వోలతో ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం రెండు రోజుల పాటూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులతో పాటూ మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల పేర్లను తొలగింపునకు అవకాశముందన్నారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి ఓటర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో గంగాధర్, బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

గోరంట్ల: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శనివారం బీఎల్‌ఓలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా బీఎల్‌ఓలు 18 సంవత్సరాలు నిండిన వారి నుంచి ఓటరు నమోదుతోపాటు మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరించారు. మండల అసిస్టెంట్ ఎన్నికల అధికారి హోదాలో తహసీల్దార్ మారుతి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆదివారం కూడా కార్యక్రమం కొనసాగుతుందని తహసీల్దార్ తెలిపారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు 26 దరఖాస్తులు

లేపాక్షి: మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదుకు 26 దరఖాస్తులు స్వీకరించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి తెలిపారు. ఫారం–6కు 14, ఫారం–7కు 8, ఫారం–8కు 4 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు విశేష స్పందన

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం పోలింగ్ స్టేషన్ నంబర్లు 115, 117లో బూత్ లెవెల్ అధికారులు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ, మార్పులు, చేర్పులపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి ఆరా తీశారు. మండల వ్యాప్తంగా 32 పోలింగ్ స్టేషన్ల వారీగా ఫారం–6 కోసం 28, ఫారం–7 కోసం 39, ఫారం–8ఏ కోసం 3 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండనున్న వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో చేరడం కోసం కొత్తగా ఫారం–6 దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. గ్రామాల్లో శాశ్వతంగా లేని వారు, మరణించిన వారి పేర్లను కుటుంబ సభ్యుల అనుమతిలో ఓటరు జాబితా నుంచి బీఎల్ఓలు తొలగించాలన్నారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు సవరణ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ.

హిందూపురం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ హరీష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఏడీజే మాట్లాడారు. చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అలాగే నవ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయస్థానాల ద్వారా ఉచిత న్యాయ సేవా సహాయం అందుతుందన్నారు. ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి న్యాయవాదులు సుదర్శన్, నవేరా, కళావతి తదితరులు బాలికా విద్య, బాల్య వివాహాలు, గృహహింస, ఓటు హక్కు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సంతోషి కుమారి, అతిక్, రవికుమార్, వీరసేన, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు, హరినందబాబు, ఊర్మిళ, సత్య, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి న్యాయం అందేలా చర్యలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవన్

పెనుకొండ: ప్రతి పేదవాడికి సత్వర న్యాయం అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వాసుదేవన్ పేర్కొన్నారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లిలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి టి.వాసుదేవన్‌తో పాటు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ ఫసపల సయ్యద్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు న్యాయ సహాయం అందిస్తామన్నారు. న్యాయవాదులు శ్రీనివాసులు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

హిందూపురం: ట్రినేటి సర్వీసు ఆర్గనైజేషన్, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంజీఎం హైస్కూల్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్గనైజర్ శివ నేతృత్వంతో వైద్యులు సంగీత, చేతన్ సుమారు 300 మందికి కంటిపరీక్షలు నిర్వహించి 110మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ కుమార్‌రాజా, ఉషారాణి, వలంటీర్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

24న వైద్య శిబిరం

రొద్దం: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈనెల24న రుక్మిణమ్మ, మాడిశెట్టి సీతారామయ్య జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సామాజిక సేవాకర్త దొంతి లక్ష్మీనారాయణగుప్తా శనివారం వైద్య శిబిరం పోస్టర్లను విడుదల చేశారు. చిన్నపిల్లలు, ఎముకలు, కీళ్లు, ఊపిరితిత్తులు, చర్మం తదితర వైద్య నిపుణులు శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

వామపక్ష నాయకుల అరెస్ట్

లేపాక్షి: హిందూపురం ప్రాంతంలో కమ్యూనిస్టు నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుడిసెలను తొలిగించేందుకు ముందస్తు జాగ్రత్తల చర్యల్లో భాగంగా సీపీఎం, సీపీఐ నాయకులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ నరేంద్ర శనివారం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేష్, సీపీఎం నాయకుడు నరసింహులు, హిందూపురం సీపీఐ నాయకుడు వినోద్‌కుమార్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

పురస్కారాలకు సార్థకత చేకూర్చాలి



పురస్కారాలు అందుకున్న సమాజ సేవకులు

పావగడ: వాల్మీకి సేవా రత్న పురస్కరాలు అందుకున్న సమాజ సేవకులు మరిన్ని సేవలందించి సమ సమాజాన్ని స్థాపించి పురస్కరాలకు సార్థకత చేకూర్చాలని దొడ్డబళ్లాపురం మహర్షి శ్రీవాల్మీకి గురుకుల పీఠాధిపతి వాల్మీకి బ్రహ్మానంద గురూజీ సూచించారు. బెంగళూరులోని గాంధీ భవన్ ఫంక్షన్ హాలులో శనివారం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పావగడకు చెందిన వివిధ రంగాల్లో సేవలందించిన 23 మంది సమాజ సేవకులకు వాల్మీకి సేవా రత్న పురస్కారాలు అందించారు.

అంగళ్లలో చోరీ

పావగడ: పట్టణంలోని తుమకూరు రోడ్డు రాజవంతి బస్టాప్ వద్ద ఉన్న మూడు పెట్టె అంగళ్లలో చోరీ జరిగింది. రాజవంతి గ్రామానికి చెందిన కుశాల్, మైలారి, మైలారప్పకు చెందిన పెట్టె అంగళ్ల షీట్‌లను శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. లోపలికి చొరబడి అంగళ్లలో ఉన్న నగదు, సిగరెట్లు, గుట్కా పాకెట్లు తదితర వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చోరీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గురునాథ్ తెలిపారు.

సోలార్ పార్క్ ఏర్పాటుకు భూముల పరిశీలన



బి.రాయాపురం వద్ద భూముల స్కెచ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు

మడకశిరరూరల్: మండలంలోని బి.రాయాపురం సమీపంలో సోలార్ పార్కు (ప్రాజెక్టు) ఏర్పాటుకు ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని బుళ్లసముద్రం, హరేసముద్రం, మణూరు, కల్లుమర్రి పంచాయతీల్లో దాదాపు 10 వేల ఎకరాల్లో సోలార్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. రైతుకు సంవత్సరానికి ఎకరాకు రూ.31 వేల చొప్పున లీజుకు తీసుకోవడం జరుగుతుందన్నారు. రెండు సంవత్సరాలకు ఒక సారి ఐదు శాతం పెంచి కంపెనీ వారు చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ జయపాల్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర టీడీపీ కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, సోలార్ కంపెనీ ఇంజనీర్ శివశంకర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: పట్టణంలోని యాదవ కాలనీలో శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పర్యటించారు. ప్రధానంగా తాగునీరు, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రోడ్లు నిర్మించాలని విన్నవించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ, కరికెర, గుడిబండ పంచాయతీల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అసైన్‌మెంట్, పట్టా భూములను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఆర్‌డీఓ ఆనందకుమార్, రెవిన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 6,000 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలు, రైతులు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఏపీ పవర్ కార్పొరేషన్ ఇంజనీర్ శివశంకర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణాకర్, మండల సర్వేయర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



పేట వెంకటరమణ స్వామి



ఆంజనేయ స్వామి

హిందూపురం: పేట వేంకటరమణస్వామి ఆలయంలో కార్తీకమాసం రెండో శనివారం పురస్కరించుకుని మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత పేట వేంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువు దీర్చి మంగళవాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ నరసింహమూర్తి, అర్చకులు కృష్ణమూర్తి, చరణ్, భక్తులు పాల్గొన్నారు.

కార్తీక పూజలు

గుడిబండ: కార్తీక శనివారం సందర్భంగా మండల పరిధిలోని ఫళారం గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామికి పూజలు చేశారు. తొలుత ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పాలు, పెరుగు, తేనె, నెయ్యి, గంగాజలంతో అభిషేకించారు. అనంతరం తులసీ పత్రంతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విందులు.. వినోదాల్లో కౌన్సిలర్లు



హైదరాబాద్‌లోని వాటర్ వరల్డ్‌లో కౌన్సిలర్లు



నీటికొలనులో సేదదీరుతున్న కౌన్సిలర్లు

హిందూపురం: మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం టీడీపీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లను ఇప్పటికే హైదరాబాద్‌లోని క్యాంప్‌నకు తరలించారు. వారం రోజులుగా వారిని విందులు, వినోదాలతో ముంచేస్తున్నారు. పట్టణంలో వార్డు ప్రజల సమస్యలు గాలికి వదిలేసిన కౌన్సిలర్లు కుటుంబసభ్యులతో ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతున్నారు. ఎస్ఎల్ వాటర్ వరల్డ్‌లో జలకాలాడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో నోటిఫికేషన్ విడుదల ఆలస్యమైంది. దీంతో కౌన్సిలర్ల క్యాంప్ మరో రెండు రోజులు పొడిగించినట్లు తెలిసింది.

23న సాగునీటి సంఘాల ఎన్నికలు

పరిగి: మండల వ్యాప్తంగా ఈనెల 23న సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు హసీనా సుల్తానా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీనికి సంబంధించిన సాగునీటి సంఘాల ఆయకట్టు రైతుల ముసాయిదా జాబితాను ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించినట్లు తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఈనెల 12లోపు తెలియజేయాలని పేర్కొన్నారు. 13న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో 5 మైనర్ ఇరిగేషన్ చెరువులతో పాటూ పీకేపీ కుడి, ఎడమ కాలువ ఆయకట్టుతో కలిపి మొత్తం 9 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో మొత్తం 9 మంది అధ్యక్షులు, 78 మంది డైరెక్టర్లను రైతులు ఎన్నుకోనున్నారు.

పొన్న సముద్రం పీడీఓను సస్పెండ్ చేయాలి

పావగడ: తాలూకాలోని పొన్నసముద్రం పంచాయతీ పీడీఓ శివానంద సాతియాశ్‌ను సస్పెండ్ చేయాలని స్థానిక ఆర్టీఐ కార్యకర్త గోవిందప్ప డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శివానంద సాతియాశ్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వారానికి ఒక్కసారి వస్తారన్నారు. సభ్యులు, ప్రజలకు అందుబాటులో లేక పోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. అతడి నిర్లక్ష్య ధోరణితో గ్రామ పంచాయతీ అభివృద్ధి కుంటుపడుతోందని వాపోయారు. పంచాయతీలోని వివిధ పథకాల సొమ్ము దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. వెంటనే అవినీతి ఆరోపణలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: మడకశిర విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అఖండ భజన ప్రారంభం

లేపాక్షి: సత్యసాయి బాబా ఆశీస్సులతో ప్రపంచ వ్యాప్త అఖండ భజన సందర్భంగా లేపాక్షిలోని సత్యసాయి మందిరంలో అఖండ భజన కార్యక్రమం ప్రారంభించారు. భజన శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగుతుందని సాయిబాబా కమిటీ సభ్యులు తెలిపారు.